# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-03-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించారు.
2. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈరోజు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటిస్తారు.
3. తెలంగాణలో ఇప్పటి వరకు 92.68 శాతం మంది రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
4. ప్రజాగళం యాత్రలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ రోజు వైఎస్ఆర్, తిరుపతి జిల్లాల్లో ప్రచారం నిర్వహించనున్నారు.
5. ప్రభుత్వ లావాదేవీలు, ఇతర చెల్లింపులు, పన్ను చెల్లింపుదారులకు ఆటంకం కలగకుండా భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఈ రోజు, రేపు బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి.

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా కంట్రోల్ రూమ్‌ను నిన్న సందర్శించిన ఆయన ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రసార మాధ్యమాల్లో వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును పరిశీలించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫిర్యాదులను ఏ విధంగా పరిష్కరిస్తున్నదీ సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ముఖేష్ కుమార్ మీనా ముందస్తు ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎం, ఇతర అనుబంధ యూనిట్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత, రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

పార్లమెంటుతో పాటు, పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అనేక పార్టీల నాయకులపై భారీ సంఖ్యలో ఫిర్యాదులు అందాయని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. గత రెండు వారాల్లో దేశవ్యాప్తంగా అందిన ఫిర్యాదులు, వీటిలో పరిష్కరించిన వాటి వివరాలను

నిన్న వెల్లడించింది. ఈ నెల 16వ తేదీ నుంచి నిన్నటి వరకు దేశవ్యాప్తంగా 79 వేల ఫిర్యాదులు సీ-విజిల్ యాప్ ద్వారా అందాయని తెలిపింది. వీటిలో 99 శాతం ఫిర్యాదులను పరిష్కరించామని, అదే సమయంలో 89 శాతం ఫిర్యాదులను కేవలం 100 నిమిషాల్లోనే పరిష్కరించామని స్పష్టం చేసింది. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వెంటనే సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

---------------------------

తెలంగాణలో వ్యవసాయ పురోగతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల శ్రేయస్సుకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఒకేసారి 2 లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు, బ్యాంకులతో కలిసి విధి విధానాల రూపకల్పన చేస్తున్నామని మంత్రి వివరించారు. 2023-24 సంవత్సరం యాసంగి సీజన్‌కు సంబంధించి నిన్నటి వరకు 64 లక్షల 75 వేల 819 మంది రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేశామని.. ఇప్పటి వరకు 92.68శాతం మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమయ్యాయని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

---------------------------

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే కొందరికి నామినేటెడ్ పదవులు ఇచ్చామన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముఖ్య నాయకులు డి. శ్రీధర్‌బాబు నేతృత్వంలోని మేనిఫెస్టో కమిటీకి సలహాలు ఇవ్వాలని నేతలకు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను నియమించి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మేనిఫెస్టోలోని 5 న్యాయ్ గ్యారంటీల ప్రచారాన్ని విస్తృతం చేస్తూ.. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ పనులను మేనిఫెస్టోలో చేర్చాలని రేవంత్ రెడ్డి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత 58 నెలల పాలనలో అనేక సంస్కరణలు తెచ్చామని ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నిన్న కర్నూలు జిల్లాలో సాగింది. యాత్రలో భాగంగా కోడుమూరులో చేనేత కార్మికులతో జగన్మోహన్ రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. ఎమ్మిగనూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. పేదలు, మహిళల కష్టాలను రూపుమాపేందుకే సంక్షేమ పథకాలు రూపొందించామని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. కాగా.. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా జగన్మోహన్ రెడ్డి ఈ రోజు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటిస్తారు.

---------------------------

గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కుంటుపడిందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో నిన్న ఆయన 'ప్రజాగళం' కార్యక్రమంలో భాగంగా రోడ్ షోలు, బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. టిడిపి హయాంలో ఓర్వకల్లులో పరిశ్రమల హబ్ కోసం, నందికొట్కూరు మండలం తంగడంచ వద్ద మెగా సీడ్స్ హబ్ కోసం, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పరిశ్రమ కోసం భూములను కేటాయించామన్నారు. తాము అధికారంలోకొస్తే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తామని

హామీ ఇచ్చారు. కాగా.. చంద్రబాబునాయుడు ఈ రోజు, రేపు వైఎస్ఆర్, తిరుపతి, కర్నూలు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పర్యటించనున్నారు.

---------------------------

జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ ఈరోజు నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయన ప్రచార షెడ్యూల్‌ను ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ నిన్న గుంటూరు జిల్లా మంగళగిరిలో ప్రకటించారు. తొలి విడతలో పవన్ కల్యాణ్ సుమారు 10 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఈరోజు నుంచి ఏప్రిల్ రెండవ తేదీ వరకు ఆయన పోటీ చేస్తున్నకాకినాడ జిల్లా పిఠాపురంలో ఉంటారు. బహిరంగ సభతో పాటు పార్టీ ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తారు. 3వ తేదీన గుంటూరు జిల్లా తెనాలి, 4న విజయనగరం జిల్లా నెల్లిమర్ల, 5న అనకాపల్లి, 6న యలమంచిలి, 7న పెందుర్తి, 8న కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. 9వ తేదీ పిఠాపురంలో నిర్వహించే ఉగాది వేడుకల్లో పాల్గొంటారు. 10వ తేదీ రాజోలు, 11వ తేదీ పి.గన్నవరం, 12వ తేదీ రాజానగరం నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పవన్ కల్యాణ్ పాల్గొంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ, పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. ఇప్పటివరకు ప్రకటించకుండా ఉంచిన 9 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విశాఖపట్నం జిల్లా భీమిలి నుంచి, విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి మాజీ మంత్రి కళా వెంకట్రావు, శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి స్థానానికి కందికుంట ప్రసాద్ పేర్లను ప్రకటించింది. విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి కలిశెట్టి అప్పలనాయుడు పోటీచేస్తారని టీడీపీ పేర్కొంది.

---------------------------

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రేపటితో ముగుస్తున్న నేపథ్యంలో దేశంలోని అన్ని బ్యాంకులకు భారతీయ రిజర్వు బ్యాంకు..ఆర్‌బీఐ కీలక ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ లావాదేవీలు, ఇతరత్రా చెల్లింపులు, పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఈ రోజు, రేపు సేవలు అందించాలని 33 బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలతో భారతీయ స్టేట్ బ్యాంకు సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ సహా 20 ప్రైవేటు రంగ బ్యాంకులు ఈ రోజు, రేపు పనిచేస్తాయి.

---------------------------

ఉభయ తెలుగురాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తర కోస్తాలోని 31 మండలాల్లో నిన్న వడగాల్పులు వీచాయి. రాబోయే రెండురోజుల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం ఏర్పడవచ్చని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం శుక్రవారం పేర్కొంది. రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశముందని తెలిపింది. ఈ రోజు రాష్ట్రంలోని 50 మండలాల్లో, రేపు 56 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. నిన్న అత్యధికంగా ప్రకాశం జిల్లా మర్రిపూడిలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అటు.. తెలంగాణలోని ఆదిలాబాద్‌లో 43.3 డిగ్రీలు, నల్గొండ జిల్లా నాంపల్లిలో 43 డిగ్రీలు, గద్వాల్‌లో 42.8 డిగ్రీలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దనొరాలో 42.7 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా

మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో రాష్ట్రంలో వడగాల్పులు వీస్తాయని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

భారత్–అమెరికా త్రివిధ దళాలు సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ తీరంలో నిర్వహిస్తున్న 'టైగర్ ట్రయంఫ్–24' విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతో పాటూ భారత తరపున ఐఎన్ఎస్ జలాశ్వ, కేసరి, ఐరావత్ యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమాల్లో మన దేశం నుంచి 700 మంది, అమెరికా నుంచి 400 మంది సిబ్బంది తమ పోరాట పటిమను ప్రదర్శించారు.

======================